క్లుప్తంగా

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోదూర్ గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం స్వామివారి కల్యాణం అర్చకులు మాధవాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు చేశారు. కల్యాణం సందర్భంగా ఎంపీపీ జాజాల బీమేశ్వరి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ జెడ్పీటీసీ జంగిలి సునీత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరామాలయ జాతర ఉత్సవాల్లో శకటోత్సవం



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి శ్రీరామాలయం జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శకటోత్సవం నిర్వహించారు. ఎడ్ల బండ్లతో పాటు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా సోమవారం సాయంత్రం 5గంటలకు రథోత్సవ కార్యక్రమం ఉంటుందని సర్పంచ్ మేసు ఏసుదాసు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, జెడ్పీటీసీ పాత పద్మ తెలిపారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బుగ్గారం: మండలంలోని వెల్గొండ గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో 24 గంటల పాటు హన్మాన్ చాలీసా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. హన్మాన్ దీక్షా గురుస్వాములు కోరుకంటి నరేశ్ స్వామి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభించిన పారాయణం ఆదివారం సాయంత్రం ముగిసింది. కార్యక్రమంలో సర్పంచ్ గాదె తిరుపతి, రఘుపతి, చెట్ల పవన్, పైడి సత్యం, చిలుకయ్య స్వామి, పోతరాజు స్వామి పాల్గొన్నారు.

మరో రెండు తడులు నీరందించాలి



టీషర్ట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(సారంగాపూర్): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని డి–53 ప్రధాన కాలువ కింద మరో రెండు తడులు సాగునీటిని అందిస్తేనే పంటలు పండుతాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాయికల్ మండలం భూపతిపూర్‌లో మల్లన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. యువ క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరిపంట ప్రస్తుతం పొట్ట, గొలుసు దశల్లో ఉందని తప్పనిసరిగా సాగునీరు అందించాలని కోరారు. ఉన్నతాధికారులు ఏప్రిల్ 20 వరకు నీటిని అందిస్తే పంటలు పండే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బట్టల వర్తక సంఘం అధ్యక్షుడిగా జనార్దన్



ఎన్నికైన కార్యవర్గం

రాయికల్(సారంగాపూర్): రాయికల్ మండల బట్టల వర్తక సంఘం ఎన్నికలు ఆదివారం పట్టణంలో జరిగాయి. అధ్యక్షుడిగా మ్యాకల జనార్దన్, ఉపాధ్యక్షుడిగా పిప్పరి జగన్, ప్రధాన కార్యదర్శిగా దాసరి గంగాధర్, కోశాధికారిగా భూర్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వర్తకసంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

ఊరికి దూరంగా.. రైతువేదికలు

- గ్రామాలకు 3 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో నిర్మాణం
- అవగాహన సదస్సుకు వెళ్లేందుకు ఆసక్తి చూపని రైతులు
- అలంకారప్రాయంగా మారుతున్న భవనాలు



చుట్టూ గడ్డి పెరిగి అధ్వానంగా మారిన నందిగిరి రైతువేదిక

పెగడపల్లి: పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతులందరినీ ఒకచోట సమావేశమై వ్యవసాయంపై చర్చించుకోవడం కోసం ప్రభుత్వ రైతువేదికలు ఏర్పాటు చేసింది. అయితే ఇవి ఊరి చివరన గ్రామాలకు దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పెగడపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 10 అనుబంధ గ్రామాలుండగా ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున నాలుగు క్లస్టర్లుగా విభజించారు. ఇందుకు గాను పెగడపల్లి, నందగిరి, ఎల్లాపూర్, నంచర్ల క్లస్టర్ గ్రామాలుగా విభజించి రూ.22లక్షల వరకు వెచ్చించి రైతువేదికలు నిర్మించారు. పెగడపల్లి రైతువేదిక మినహా మిగతా క్లస్టర్ గ్రామాల్లో నందగిరి, ఎల్లాపూర్, నంచర్ల గ్రామాల్లో గ్రామానికి సమీపంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో వాటిని ఆయా గ్రామాల్లో ఊరికి దూరంగా ఉన్న గ్రామ శివారులోని ప్రభుత్వ గుట్ట బోరులపై నిర్మించారు.

నిరుపయోగంగా రైతువేదిక భవనాలు..

ఇదిలా ఉండగా క్లస్టర్లను కలుపుతూ ఏర్పాటు చేసిన గ్రామాలు కూడా క్లస్టర్ గ్రామానికి సుమారు 3 నుంచి 6 కిలోమీటర్ల దూరం వరకు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు రైతువేదికల వద్దకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. క్లస్టర్ వారీగా రైతువేదిక భవనాన్ని సుమారు రూ.22లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ రైతువేదికలను ఏడాదిన్నర క్రితమే ప్రారంభించారు. కానీ క్లస్టర్‌కు పలు గ్రామాలు 3 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. దీంతో రైతువేదికల్లో వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సులకు వెళ్లడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. జన సందోహం లేని చోట రైతువేదికలు నిర్మించడంతో వ్యవసాయ అధికారులు సైతం రైతువేదికలకు వెళ్లకుండా గ్రామాల్లో ఫీల్డ్ విజిట్ చేసి విధులు పూర్తి చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఊరికి దూరంగా ఉన్న రైతువేదికలు రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా రైతువేదికలపై దృష్టిసారించక పోవడంతో అలంకారప్రాయంగా మారుతున్నాయని రైతులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నం



రైతువేదిక భవనాల్లో ఏర్పాటు చేసిన భవనాల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. క్లస్టర్ గ్రామానికి దూరంగా ఉన్న రైతులు అక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్ని సందర్భాల్లో రైతులకు వాహనాలు సమకూర్చి శిక్షణకు తీసుకువచ్చే ఏర్పాట్లు కూడా చేస్తున్నాం.

– జ్యోతి, ఏవో

6కిలోమీటర్ల దూరంలో..



మా గ్రామానికి సుమారు 6కిలో మీటర్ల దూరంలో ఉన్న నందగిరి క్లస్టర్‌లో కలిపారు. గ్రామం నుంచి రైతులం అక్కడకు వెళ్లాలంటే వాహన సౌకర్యం ఉండాలి. కిరాయి వాహనంలో వెళ్లాలంటే వాహనదారులకు రానుపోను రూ.వెయ్యి ఇచ్చుకోవాల్సి వస్తోంది.

– పుప్పాల రమేశ్, రైతు, దోమలకుంట

రవాణా సౌకర్యం లేక..



నాది నామాపూర్ గ్రామం. క్లస్టర్ గ్రామానికి సుమారు 6కిలో మీటర్ల దూరం ఉంటుంది. ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల భవనాలు దూరంగా ఉండటంతో అధికారులు ఏర్పాటు చేస్తున్న రైతు అవగాహన సదస్సులకు రవాణా సౌకర్యం లేక అక్కడికి వెళ్లలేకపోతున్నాం. రైతులకు అనుకూలమైన చోట భవనాలు నిర్మించాలి.

– దండవేని గంగరాజు, రైతు, నామాపూర్

అటెన్షన్ ప్లీజ్



పొంచి ఉన్న ప్రమాదం

మల్లాపూర్: మండలంలోని రాఘవపేట–చిట్టాపూర్ లింక్‌రోడ్డులో ఎస్సారెస్పీ డీ–29 ఉప కాలువ సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నుంచి ప్రైవేట్ వాహనాలు, రైతులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. వంతెన సైడ్‌వాల్ కూలిపోయి ఉండడంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై కూలిన సైడ్‌వాల్‌కు మరమ్మతు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : రాకేశ్, ఎస్సారెస్పీ ఏఈ, మల్లాపూర్
ఫోన్ నంబర్: 77991 38367

కులసంఘాల అభ్యున్నతికి కృషి



సన్మానిస్తున్న భక్త సమాజం కమిటీ ప్రతినిధులు

మెట్‌పల్లి: నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని మార్కండేయ మందిరంలో శనివారం రాత్రి పద్మశాలీ సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన ధ్యావనపల్లి రాజారాంతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం కుల సంఘాల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్డెపల్లి శ్రీనివాస్, సంకు ఆనంద్, భీమనాతి సత్యనారాయణ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం భక్త సమాజానికి అప్పగింత

కోరుట్లటౌన్: షిర్డీ శ్రీసాయిబాబా ఆలయం, దేవాదాయ శాఖ నుంచి భక్త సమాజానికి అప్పగించారు. ఈ మేరకు ఆదివారం దేవాలయంలోని సత్యనారాయణ స్వామి హాలులో షిర్డీ శ్రీసాయి భక్త సమాజం కమిటీ శాశ్వత సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షిర్డీ శ్రీసాయిబాబా దేవాలయాన్ని దేవాదాయ శాఖ నుంచి భక్త సమాజానికి అప్పగిస్తున్నట్లు సంబంధిత ఉత్తర్వులు అధ్యక్షుడు భూమయ్యకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అందజేశారు. డాక్టర్ అనూప్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిదురాల భూమయ్య, ప్రతినిధులు విద్యాసాగర్, పురుషోత్తం, ప్రవీన్, నాగభూషణం, లక్ష్మయ్య, రాజేశ్వర్, కాశీనాథం, రాంనారాయణ, ఇంద్రాబాయి, లింగయ్య, అశోక్, ఆనంద్, మోహన్, హన్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

జగిత్యాల: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు సేవా దృక్పథంతో పాటు క్రమశిక్షణ అవడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో క్రీడా ప్రాంగణం, రూ.7.60లక్షలతో ఎన్‌సీసీ శిక్షణ గ్రౌండ్ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. బాస్కెట్‌బాల్ కోర్టు కోసం రూ.5లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగులు పోలీస్, ఇతర శాఖల్లో ఉద్యోగాలు పొందడానికి రూ.33లక్షలతో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు మంచి ఫలితాలను ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, కమిషనర్ డాక్టర్ నరేశ్, ప్రిన్సిపాల్ అశోక్ పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రి, ఆపి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన 21 మందికి ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. శస్త్ర చికిత్సల అనంతరం మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏవీఎల్‌ఎన్ చారి, సభ్యులు మంచాల క్రిష్ణ, టీవీ సూర్యం, రైతుబంధు సమితి కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, డా.విజయ్‌కుమార్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

సారంగాపూర్: సారంగాపూర్‌లోని శ్రీరామాలయంలో ఆదివారం హరిద్వారా శాంతి కుంజు జగిత్యాల గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో గాయత్రి హోమం, యజ్ఞం నిర్వహించారు. అంజనేయ స్వామి భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గాయత్రి పరివార్ జగిత్యాలశాఖ ప్రతినిధి నర్సింహారెడ్డితో పాటు, సర్పంచ్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూసుఫ్‌నగర్ టు అయిలాపూర్‌కు ఆర్టీసీ బస్సు

కోరుట్లటౌన్: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అయిలాపూర్ పరీక్ష కేంద్రానికి చేరేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ లక్ష్మీప్రసూన ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన గ్రంథాలయ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్ పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం విషయం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన డిపో మేనేజర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని చెప్పడంతో సానుకూలంగా స్పందించారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ఉదయం 8 గంటలకు యూసుఫ్‌నగర్ నుంచి అయిలాపూర్ పరీక్షా కేంద్రం వరకు బయలుదేరుతుందని డీఎం తెలిపారు.

నేటి నుంచి శ్రీమద్భాగవత ప్రవచనాలు

కోరుట్లటౌన్: పట్టణంలోని వాసవీ కల్యాణ భవనంలో సోమవారం శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన జ్ఞాన యజ్ఞం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కొత్త సురేశ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు వారం రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, స్వధర్మ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి ప్రవచనాలు బోధిస్తారని పేర్కొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

సారంగాపూర్: ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేశ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధానంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో పాటు, 18 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఇప్పటికీ ఇంకా ఆశించిన స్థాయి ఫలితాలు రాలేదని, రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు పుల్లూరి సత్యనారాయణ, సీనియర్ రాజకీయ నాయకుడు మహంకాళి రాజన్న, బీర్‌పూర్ మండల అధ్యక్షుడు పాత రమేశ్, మురికి శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో ఆర్యవైశ్యులు 102 స్తంభాలతో నిర్మిస్తున్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ప్రతీ ఆదివారం భజన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. భజన అనంతరం అన్నప్రసాదం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

✦ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు ఎన్నికలు

కోరుట్లటౌన్: ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు కోరుట్ల నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా గోరుమంతుల నారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడిగా బలిజ సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని కావేరి గార్డెన్‌లో ఆదివారం నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కట్కూరి మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు దానం కిషన్, జనరల్ సెక్రటరీ మల్యాల సతీశ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు బూరం సంజీవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పింజారి శివకుమార్, ఉపాధ్యక్షులుగా బొల్లం రాజు, ఎన్నం రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా ఊడుగుల గంగాధర్, అల్లం రాజేశ్, కోశాధికారిగా ఇంద్రాల హరీశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తరి రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా గోరుమంతుల నారాయణ, గౌరవ సలహాదారులుగా మిడిదొడ్డి మల్లేశ్, కార్యవర్గ సభ్యులుగా దుర్గాప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌నాయక్, గంగాధర్ నాయక్, నరేశ్, మల్లేశ్, లక్ష్మణ్, రజనీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

✦ఆస్తిపన్నుపై 5శాతం రాయితీ

కోరుట్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 30, 2023 వరకు ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎం.డీ అయాజ్ ఆదివారం పేర్కొన్నారు.

✦ఆస్తి పన్నుపై రాయితీని వినియోగించుకోవాలి

మెట్‌పల్లి: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఆస్తి పన్నుపై రాయితీ కల్పిస్తోందని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 30లోపు చెల్లించే బిల్లులపై 5శాతం రాయితీ వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

✦ఆర్‌ఎంపీకి ఉచిత వైద్యం అందించిన డాక్టర్‌కు సన్మానం

గొల్లపల్లి: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన వంగ నరేందర్ అనే ఆర్‌ఎంపీ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు జగిత్యాల తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు కరీంనగర్‌లోని అఖిర హాస్పిటల్‌కు తరలించారు. వైద్యుడు హనుమ (న్యూరో సర్జన్) నరేందర్‌కు చికిత్స అందించారు. హాస్పిటల్‌లో రూ.5లక్షల వరకు అయిన బిల్లును మాఫీ చేసి ఉచితంగా వైద్య చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా వైద్యుడు హనుమను, హాస్పిటల్ యాజమాన్యాన్ని గొల్లపల్లి ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సన్మానించింది.

✦నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏలేటి చిన్నారెడ్డి తెలిపారు. జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఈ వైద్యశిబిరం ఉంటుందని చెప్పారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్వాయి పాపన్న



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో..



రాయికల్ మండలంలో..



మల్లాపూర్: రేగుంటలో..

జగిత్యాలటౌన్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, అదనపు కలెక్టర్ బీఎస్ లత హాజరై సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబా, మెప్మా ఏవో దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, గోప సభ్యులు గుర్రం సత్యనారాయణగౌడ్, బాలుసాని సత్తయ్య, నేరెళ్ల మల్లేశంగౌడ్, మంద మల్లేశంగౌడ్, భూసారపు శ్రీనివాస్‌గౌడ్, ముప్కం భూమయ్య పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతి నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ పాల్గొన్నారు. మండలంలోని కమలాపూర్‌లో నివాళి అర్పించారు. మండల గౌడసంఘం నేతలు పాల్గొన్నారు.

కథలాపూర్ మండల కేంద్రంలో..

కథలాపూర్: మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు ముంజ బాబు, పొన్నం దశాగౌడ్, ముంజ నవీన్‌గౌడ్, ముంజ దేవేందర్, లింగం, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాయికల్ మండలంలో..

రాయికల్(సారంగాపూర్): రాయికల్ మండల కేంద్రంతో పాటు, వీరాపూర్, ఇటిక్యాలలో నివాళి అర్పించారు. సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ రాత, పీఏసీఎస్ చైర్మన్ మహిపతిరెడ్డి, నీరటి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, లింగంగౌడ్, జగన్‌గౌడ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: బహుజనుల పోరాటయోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు రామాగౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని రేగుంట, సాతారం గ్రామాల్లో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు.



ధర్మపురిలో..



కథలాపూర్: గౌడ సంఘం ప్రతినిధులు

గ్రామాల్లో 'బలగం' ప్రదర్శన



బలగం సినిమా చూస్తున్న ప్రజలు

పెగడపల్లి: 'బలగం' సినిమా ప్రజలను ఆకట్టుకుంటోంది. మండలంలోని సర్పంచులు తమ గ్రామాల్లో ఈ సినిమాను ప్రొజెక్టర్ల ద్వారా ప్రత్యేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తున్నారు. గ్రామ ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి సినిమా తిలకిస్తున్నారు. మండలంలో ఇప్పటికే దీకొండ, ఆరవెల్లి గ్రామాల్లో సినిమా ప్రదర్శించగా ఆదివారం రాత్రి రామబద్రునిపల్లిలో ప్రదర్శించారు. సర్పంచులు ఉప్పులంచె లక్ష్మన్, కోరుకంటి రాజేశ్వర్‌రావు, గౌర్లె భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు గంగారెడ్డి, అంజయ్య ఆయా గ్రామాల ప్రజలతో కలిసి చిత్రాన్ని తిలకించారు. పాత కాలంలో వీధుల్లో సినిమాల ప్రదర్శన జరిగేవని, చాలారోజుల తర్వాత బలగం సినిమాతో మళ్లీ ఆ సంప్రదాయం మొదలైందని పల్లె ప్రజలు ముచ్చటిస్తున్నారు.